క్లుప్తంగా

కేజీబీవీ విద్యార్థినులకు వైద్య పరీక్షలు



వీపనగండ్ల: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థినులకు శుక్రవారం స్థానిక వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలోని 45 మంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సువర్ణ, ఏఎన్‌ఎం భారతి, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత




కొత్తకోట: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వివిధ రకాల ప్రభుత్వ ఉద్యోగ ప్రకటనలు విడుదల చేయడంతో పట్టణంలోని ఎస్సీ కాలనీలో గల నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు 'జేఎస్‌ఆర్ ఫౌండేషన్' సభ్యులు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ ఉన్నత విద్య, ఉద్యోగాల ద్వారానే దళితులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా కష్టపడి చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అమృతరాజు, భక్తరాజు, శేఖర్, సతీష్‌రాజు, మహిమరాజు, శ్యామ్‌కుమార్, దయానందరాజు తదితరులు ఉన్నారు.

తెగుళ్లపై రైతులకు అవగాహన



పెబ్బేరు: మండలంలోని బునాదిపూర్‌లో యాసంగిలో పంటలకు వస్తున్న తెగుళ్లపై రైతులకు శుక్రవారం వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యాసంగిలో వరి, మినుము పంటలకు తెగుళ్ల అధికంగా వస్తున్నాయని, వాటికి వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతోనే మందులు పిచికారీ చేయాలని ఫ్లెక్సీలో చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ ఈ కేవైసీ కొంతమంది రైతుల ఆధార్ కార్డు సీడింగ్ అయిందని, మిగతా రైతులు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వనం గోవిందమ్మ, ఏఈఓ నరేష్, రైతులు నరేందర్, రాముడు, బాలస్వామి, రాఘవేంద్ర, గోవిందు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ



కొత్తకోట రూరల్ (పెద్దమందడి): మండలంలోని మంగంపల్లి పంచాయతీ రికార్డులను శుక్రవారం డీఎల్‌పీఓ రఘునాథ్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులో నమోదు చేయాలన్నారు. అదేవిధంగా గ్రామంలో జరిగే ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెంచాలని పంచాయతీ కార్యదర్శులకు, టీఏకు, ఎఫ్ఏకు సూచించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు ఎండిపోకుండా రెండు పూటల నీళ్లు పోయించాలని ఆదేశించారు.

రజకుల అభ్యున్నతికి కృషి

కొత్తకోట: పపట్టణ శివారులో గల దోబీ ఘాట్ కంపౌండ్ వాల్ నిర్మాణం కోసం జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుకేశిని, వైస్ చైర్‌పర్సన్ జయమ్మ భూమిపూజ చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశానుసారం మున్సిపల్ నిధుల నుంచి మంజూరైన రూ.6లక్షల వ్యయంతో కంపౌండ్ నిర్మిస్తున్నట్లు సుకేశిని తెలిపారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, వెంకటేష్, ఆర్మీ బాలస్వామి, బాలరాజు, లక్ష్మయ్య, విశ్వేశ్వర్, గాడీల ప్రశాంత్, అయ్యన్న, సుభాష్, నాగేష్‌రెడ్డి, బాబా, తదితరులు ఉన్నారు.



రెండు గదులు.. ఐదు తరగతులు

- పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం అందులోనే..
- రంగవరంలో విద్యార్థులకు తప్పని తిప్పలు
- చిన్నారులకు అందించే పౌష్టికాహారం నిల్వ చేయడానికి ఇబ్బందులు



వరండాలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు



ఇరుకు గదుల్లో అంగన్‌వాడీ చిన్నారులు

వీపనగండ్ల: నాణ్యమైన ప్రాథమిక విద్య అందించేందుకు అన్ని వసతులను సమకూరుస్తున్నామని పాలకులు, అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. మండలంలోని రంగవరంలో రెండు గదుల్లో ఐదు తరగతులు, అందులోనే పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చే చిన్నారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఉన్నా.. విద్యార్థులు చదువుకునేందుకు రెండు గదులు మాత్రమే ఉన్నాయి. ఐదు తరగతులను ఏదో విధంగా నెట్టుకు వస్తున్న తరుణంలో అంగన్‌వాడీ కేంద్రం కోసం రెండు గదుల్లో ఒక గదిని తీసుకున్నారు. పంచాయతీ కార్యాలయానికి ప్రత్యేక భవనం లేకపోవడంతో దానికి కూడా అంగన్‌వాడీ కేంద్రంలోనే కొనసాగిస్తున్నారు.

గది నిండా సామగ్రి..

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు నిల్వ ఉంచిన పదార్థాలు, ప్రమాదకరమైన గ్యాస్ సిలిండర్లు, వంట స్టౌవ్ ఒక మూలకు ఉంచగా.. మరో మూలకు బీరువాలు, ఆయిల్ ప్యాకెట్లు, గుడ్లు వేసుకున్నారు. ఇవి చాలదన్నట్లుగా అదే గదిలో పంచాయతీ కార్యాలయ ఫర్నీచర్, కుర్చీలను తెచ్చి పెట్టారు. దీంతో ఇరుకు గదుల్లో ప్రతి రోజు చిన్నారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇక పాఠశాలకు కేటాయించిన ఒక గదిలో మొత్తం 23 మంది పిల్లలు ఉండగా.. ఇద్దరు టీచర్లు ఉండి వరండాలో 3 తరగతులు, గదిలోని రెండు మూలలకు రెండు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల ఆవరణలో ఖాళీ స్థలం ఉన్నా పంచాయతీ భవనం, అంగన్‌వాడీ భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించకపోవడంతో విద్యార్థులు, చిన్నారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

చిన్నారులకు ఇబ్బందులు

అంగన్‌వాడీ భవనం నిర్మాణం కోసం గ్రామపంచాయితీ నుంచి ఎన్నోసార్లు తీర్మాణం పంపించాం. అయినా భవన నిర్మాణాన్ని చేపట్టలేదు. పౌష్టికాహారం, వివిధ రకాల వస్తువులు ఒక మూలకు వేసుకుని అంగన్‌వాడీ సెంటర్‌ను నడుపుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలి.

– చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్, రంగవరం

నిధులు మంజూరయ్యాయి

రంగవరంలో నూతన పంచాయతీ భవనాన్ని నిర్మించేందుకు ఇటీవలే నిధులు మంజూరయ్యాయి. దీంతో భవన నిర్మాణాన్ని వెంటనే చేపడుతాం. విద్యార్థులకు, చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా గ్రామంలో మరో గదిని అద్దెకు తీసుకుని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే చర్యలు తీసుకుంటాం.

– కతలప్ప, ఎంపీడీఓ, వీపనగండ్ల

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

పాన్‌గల్: ప్రతి గ్రామ పంచాయతీకి కేటాయించిన ప్రత్యేక నిధుల (ఎస్‌డీఎఫ్)తో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్ రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని శాగాపూర్‌లో ఎస్‌డీఎఫ్ నిదులు రూ.10 లక్షలతో చేపడుతున్న ఫార్మేషన్ రోడ్డు నిర్మాణాలకు స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలాలకు వెళ్లే దారులు సక్రమంగా లేక రైతులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారని, ఈ విషయాన్ని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ప్రత్యేక నిధులు కేటాయించినట్లు వారు పేర్కొన్నారు. ఆయా నిధులతో రోడ్ల నిర్మాణాలను నిబంధనల మేరకు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మౌనికయాదవ్, ఎంపీటీసీ సుబ్బయ్య యాదవ్, మండల కోఆప్షన్ సభ్యుడు హలీమ్, ఉప సర్పంచ్ లలిత, పంచాయతీ కార్యదర్శి మహేష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రాముయాదవ్, రవికుమార్, జ్యోతినందన్‌రెడ్డి, రఘుపతినాయుడు, డా.తిరుపతయ్య, చంద్రయ్య, తిరుపతియాదవ్, మల్లేష్‌యాదవ్, సుబ్బయ్యయాదవ్, శ్రీనివాసులు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా పనిచేసే వారినే గెలిపించండి



వీపనగండ్ల/చిన్నంబావి: నిస్వార్థంగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పనిచేసే వారినే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య అన్నారు. శుక్రవారం గోవర్ధనగిరి, బొల్లారం గ్రామాల్లో, చిన్నంబావి మండలంలోని వెలగొండ, బెక్కం, పెద్దదగడ, దగడపల్లి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాణిక్యరెడ్డిని గెలిపించాలని కోరుతూ.. ప్రచారం నిర్వహించారు. పీఈటీ, పండిట్ పోస్టుల్లో పదోన్నతులను కల్పించేందుకు కోర్టు కేసుల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. రాష్ట్రంలో 11 వేల పండిట్, పీఈటీ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. అక్రమ బదిలీలను వెంటనే రద్దు చేయాలని, కేజీబీవీ, గురుకుల, మోడల్ స్కూళ్లలో పదోన్నతులతో పాటు ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవిప్రసాద్‌గౌడ్, కృష్ణయ్య, శ్రీనివాసులు, రాజశేఖర్, బాలీశ్వర్ పాల్గొన్నారు.

పాఠశాల సమయానికి బస్సులు నడపాలి



కొంకన్‌వానిపల్లిలో బస్సు ఎక్కడానికి గుమిగూడిన విద్యార్థులు

అమరచింత: పాఠశాల, కళాశాల సమయానికి ఆర్టీసీ బస్సులు నడపాలని ఏబీవీపీ జిల్లా నాయకుడు వినోద్ డిమాండ్ చేశారు. మండలంలోని కొంకన్‌వానీపల్లి, పాంరెడ్డిపల్లి గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది విద్యార్థులు అమరచింత, ఆత్మకూర్, కొత్తకోట, వనపర్తి పట్టణాల్లో చదువుకోవడానికి వస్తుంటారు. ప్రతి రోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి పది గంటల వరకు ప్రతి అరగంటకు ఒక ఆర్టీసీ షటిల్ సర్వీస్ నడపాలని, అప్పుడే విద్యార్థులు సకాలంలో పాఠశాల, కళాశాలలకు చేరుకుంటారని తెలిపారు. పాఠశాలల సమయానికి బస్సులు నడపాలని పలుమార్లు నారాయణపేట, గద్వాల, వనపర్తి డిపో మేనేజర్లకు వినతిపత్రాలు ఇస్తున్న ఫలితం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ గద్వాల డిపోకు చెందిన ఒక ఆర్టీసీ షటిల్ బస్సునే మరికల్, ఆత్మకూర్ వరకు కొనసాగిస్తుండటంతో విద్యార్థులతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాల సమయానికి బస్సులు కొనసాగించేందుకు చొరవ చూపాలని కోరారు. లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో అనిల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి కృషి



కొత్తకోట: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ నిరంతరం కృషి చేస్తుందని పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణ కేంద్రంలో గల వివిధ పాఠశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరుగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వాలని, నిరంతరం సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తానన్నారు. కార్యక్రమంలో సూర చంద్రశేఖర్, సూర సత్యనారాయణ, గోపాల్, భక్తరాజ్, లక్ష్మణ్, సునీల్‌కుమార్, బాలరాజు, శ్రీశైలం, లక్ష్మయ్య, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

స్థలాలున్న పేదలకు సాయం చేయండి

అమరచింత: ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల్లో సొంతగా పునాది నిర్మించుకున్న నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వ పరంగా ఒక్కొక్కరికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం అన్నారు. ఈ మేరకు సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ చాంద్‌పాషకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా అబ్రహం మాట్లాడుతూ పట్టణంలోని సర్వేనంబర్ 149లో 134 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నివాస స్థలాలు ఇచ్చిందన్నారు. వాటిలో ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం సాయం చేయకపోతే తహసీల్దార్ కార్యాలయాన్ని లబ్ధిదారులతో కలిసి దిగ్బంధం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ అధ్యక్షుడు భాస్కర్, శ్యాంసుందర్, కుతుబ్, ఎర్రన్నల తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అంధత్వ నివారణ కోసమే 'కంటివెలుగు'



బుడిదపాడులో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ ఆవుల శైలజ, అధికారులు



వెంకటాపురంలో..



రోడ్డుమీదితండాలో..

ఖిల్లాఘనపురం: మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో శుక్రవారం మొత్తం 291 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సౌజన్యలత తెలిపారు. ఖిల్లాఘనపురం పీహెచ్‌సీ పరిధిలోని కర్నె తండాలో 143 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా నలుగురికి అద్దాలు అందించారు. అదేవిధంగా ఇద్దరికి ఆపరేషన్ అవసరమని గుర్తించామన్నారు. కమాలోద్దీన్‌పూర్ పీహెచ్‌సీ పరిధిలోని రోడ్డుమీది తండాలో మొత్తం 148 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 35 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయడం జరిగిందని వారు తెలిపారు. అదేవిధంగా 16 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. 18ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతో పాటుగా అవసరమైన వారికి మందులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాంచందర్‌రెడ్డి, మక్బూల్ పాష పాల్గొన్నారు.

476 మందికి..

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు కేతేపల్లి, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో 476 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. వీరిలో 48 మందికి కంటి అద్దాలు, 43 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం సిఫార్సు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 18ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కేంద్రాలకు వచ్చి కంటి పరీక్షలు చేయించుకునేలా సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు డాక్టర్ పేర్కొన్నారు.

159 మందికి..

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని వెంకటాపురం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమంలో 159 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. వారిలో 11 మందికి రీడింగ్ అద్దాలను పంపిణీ చేశామని, 15 మందికి అద్దాల తయారీకి పంపిచామన్నారు. ఏడుగురు ఆపరేషన్ అవసరం ఉన్న వారిగా గుర్తించామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పవన్‌కుమార్, ప్రియాంక, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్ఎం అనురాధ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పెబ్బేరు: మండలంలో బూడిదపాడులో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఎంపీపీ ఆవుల శైలజ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ భాగమ్మ, డాక్టర్ సుధారాణి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటసుబ్బమ్మ, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి ఉమ, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని వినతి



సీఎండీ రాఘుమారెడ్డి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లులో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయాలని సీఎండీ రఘుమారెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించినట్లు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం సాక్షితో ఫోన్‌లో మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, వ్యవసాయానికి 25 కేవీ కొత్త ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. అదే విధంగా జానంపేట, అన్నసాగర్ గ్రామాలకు డబుల్ ఫీడర్ చానల్స్ ఏర్పాటు చేయాలని, అవసరం ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ కొత్త లైన్ కోసం అదనంగా కరెంటు స్తంభాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. భూత్పూరు మున్సిపాలిటీ, దేవరకద్ర మండలానికి ట్రాన్స్‌ఫార్మర్స్, మూసాపేట, అడ్డాకుల, దేవరకద్ర, కొకుంట్ల, చిన్నచింతకుంట మండలాలకు రూ.8.25 కోట్లు మంజూరు చేయాలని విన్నవించినట్లు తెలిపారు. కొత్తకోట, మదనాపురం మండలాలకు సంబంధించి రూ.2.17 కోట్లు తక్షణమే మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

పాఠశాల ఆవరణలో పందుల సంచారం



పాఠశాల ఆవరణలో విద్యార్థులు భోజనాలు చేస్తుండగా సంచరిస్తున్న పందులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పందుల సంచారంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనం చేసే సమయంలో పందులు గుంపులు, గుంపులుగా విద్యార్థులు భోజనాలు చేసే ప్రాంతాల్లో సంచరిస్తుండటంతో విద్యార్థులు భోజనాలు చేయలేకపోతున్నారు. పందులను చెదరగొట్టేందుకు నానాతంటాలు పడుతున్నారు. ఒక పక్క భోజనం ప్లేటు, మరో పక్క చేతిలో కర్రతో విద్యార్థులు వాటిని చెదరగొడుతున్నారు. పాఠశాల ఆవరణకు ఒక పక్క ప్రహరీ లేకపోవడంతో పందులు చొరబడుతున్నాయి. ఒక పక్క పందులు, కుక్కలు, కోతుల సంచారంతో భోజనాలు చేసే సమయంలో వాటి నుంచి రక్షించుకుంటూ విద్యార్థులు భోజనాలు చేయడం తలకు మించిన భారంగా మారింది. ఈ విషయాన్ని పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందుల సంచారాన్ని నిరోధించాలని విద్యార్థులు కోరుతున్నారు.

శివాలయం పునర్నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కుమార్‌గౌడ్ దంపతులు

పాన్‌గల్: మండలంలోని చింతకుంటలో శివాలయాన్ని పునర్నిర్మించేందుకు శుక్రవారం గ్రామస్తుల సమక్షంలో భూమిపూజ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. రూ. కోటి అంచనా వ్యయంతో నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. దాతల నుంచి దాదాపుగా రూ. 25 లక్షలు, మిగతా డబ్బులు అమెరికాలో ఉంటున్న గ్రామవాసి కుమార్‌గౌడ్ కుటుంబ సభ్యులు అజయ్‌కుమార్‌గౌడ్, ప్రవళిక, ప్రియాంక అందించేందుకు ముందుకు వచ్చినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో దాత కుటుంబం, సర్పంచ్ అనూష, ఎంపీటీసీ రమాదేవి, సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాంమూర్తి నాయుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అభిలాష్ రావు, బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నూతన మసీదు నిర్మాణ పనులు ఆపాలి



ఆర్ఐకి వినతిపత్రం ఇస్తున్న జామీయా మసీదు కమిటీ సభ్యులు

అమరచింత: పట్టణంలో జామీయా మసీదు కమిటీకి సమాచారం ఇవ్వకుండా ముస్లిం మైనార్టీల అభిప్రాయం లేకుండా నూతనంగా నిర్మిస్తున్న మసీదు నిర్మాణ పనులను ఆపాలంటూ మున్సిపల్ ఆర్ఐ కృష్ణయ్యకు మసీదు కమిటీ సభ్యులు శుక్రవారం వినతిపత్రం అందించారు. మసీదు నిర్మాణం వల్ల ముస్లింల ఐఖ్యత దెబ్బతింటుందన్నారు. నూతన మసీదు నిర్మాణం చేపట్టకూడదని జామీయా మసీద్ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించిందని వారు మున్సిపల్ అధికారులకు విన్నవించారు. పట్టణంలోని కబరస్తాన్‌లో రెహామనీయా మసీదు నిర్మాణం సమయంలో చాలాసార్లు సమావేశాలు, చర్చలు జరిగిన తర్వాత నిర్మాణం జరిగిందన్నారు. పట్టణ ముస్లింల అభిప్రాయం, ముస్లిం కమిటీ సభ్యుల తీర్మాణం లేకుండా నిర్మిస్తున్న మసీదు నిర్మాణ పనులకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని కోరారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, కమిటీ సభ్యులు కుతుబ్, తౌఫిక్, అన్సారీ, అశ్వర్, ఖాజా, పాష, మలంగ్, మహిమూద్, గౌస్, షాకీర్, అబిద్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే మత్స్యకారుల అభివృద్ధి



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్

వనపర్తి: కేసీఆర్ పాలనలోనే మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్, మత్స్యకార సంఘం నాయకుడు వాకిటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని నాగవరం శివారులో గల రైతువేదికలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మత్స్యకారులకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మత్స్యకారుల కోసం ఉచిత చేపపిల్లల పంపిణీ, సబ్సిడీ వాహనాలు ఇవ్వటంతో పాటు చేపల చెరువుల తవ్వకం, మత్స్యకారులకు బీమాను వర్తింపజేసి వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారికి ఆశించిన ప్రొత్సాకం అందిస్తున్నట్లు వెల్లడించారు. చేపల విక్రయానికి మార్కెట్లను నిర్మాణం చేయిస్తున్న ఘతన బీఆర్ఎస్ ప్రభుత్వానికే చెందుతుందన్నారు. సంఘాల, రికార్డుల నిర్వహణ, ఆడిటింగ్ తదితర అంశాలపై మత్స్యకారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో మత్స్యకారుల అభివృద్ధి కోసం మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ రహెమాన్, సంఘం నాయకులు పుట్ట బాలరాజు, ఉండెకోటి నాగేంద్రం, నాయకులు రంగస్వామి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వనపర్తి క్రైం: ప్రజలు ఇచ్చిన వ్యక్తిగత దరఖాస్తులను విచారించి తక్షణమే పరిష్కరించాలని ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు, డబల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటి స్థలం ఉన్న వారికి రూ.5లక్షల నిధులు ఇవ్వాలని ఇచ్చిన వ్యక్తిగత 150 దరఖాస్తులను శుక్రవారం నాయకులు తహసీల్దార్ రాజేందర్‌గౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పరమేశ్వరాచారి, రాములు, సాయిలీల, గట్టయ్య, మహేష్ తదితరులు ఉన్నారు.



రూ.1.20కోట్లతో డివైడర్ పనులు



ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలో రూ.1.20 కోట్ల వ్యయంతో డివైడర్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పురపాలిక వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం గాంధీచౌక్ నుంచి అమరచింత రోడ్డు వైపు చేపడుతున్న డివైడర్ పనులను వారు పరిశీలించారు. గాంధీచౌక్ నుంచి బస్టాండ్ రోడ్డు వైపున త్వరలోనే డివైడర్ పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, నాయకులు మాసన్న, రియాజ్అలీ, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.